సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



అలంపూర్ కిటకిట

జోగుళాంబ బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

వివరాలు 8లో ▸



ఘనంగా గంపజాతర

గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం గంపజాతర నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /18.0

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీయనున్నాయి. రోజంతా సాధారణ వాతావరణం ఉండి, మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

శనేశ్వరాలయంలో శివనామస్మరణ



బిజినేపల్లి: మహాశివరాత్రి, శనిత్రయోదశి 144 సంవత్సరాల తర్వాత ఒకటే రోజు రావడంతో మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనైశ్వరాలయం, శివాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి శివాలయంలో శివుడికి పంచామృతాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు ఆలయ భక్తులతో కిటకిటలాడింది.

అంతర్జాతీయ ఆర్మీ ఫైరింగ్‌కు పోతేపల్లి వాసి



శేఖర్

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లికి చెందిన ఆర్మీ సైనికుడు శేఖర్ అంతర్జాతీయ ఆర్మీ ఫైరింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన ఫైరింగ్ సెలక్షన్‌లో దేశం నుంచి నలుగురు ఆర్మీ జవాన్లు ఎంపిక కాగా.. అందులో మన ప్రాంతానికి చెందిన శేఖర్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో అనేక దేశాల నుంచి పాల్గొనే 400 మంది బెటాలియన్స్‌కి మధ్య ఫైరింగ్ పోటీలు జరగనున్నాయి. ఫైరింగ్ పోటీలకు శేఖర్ ఎంపిక కావడంపై మండల నాయకులు, గ్రామస్తులు, యువకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

'విజయంతో రావాలి'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 20 నుంచి బెంగళూరులోని రెవా యూనివర్సిటీలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ క్రికెట్ పోటీలలో పాల్గొనేందుకు పీయూ క్రికెట్ జట్టు శనివారం బయలుదేరింది. ఈమేరకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పీడీ బాల్‌రాజ్, క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ తరుపున ఆడేందుకు విద్యార్థులకు చక్కని అవకాశం దొరికిందని, దానిని సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. క్రీడాస్ఫూర్తితో విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు.

నేడు జీబీపీఎల్-5 క్రికెట్ టోర్నీ ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని పురస్కరించుకొని గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జీబీపీఎల్-5 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో ప్రారంభంకానున్నట్లు ఆర్గనైజర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.45 గంటలకు టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. జీబీపీఎల్ క్రికెట్ టోర్నీ ఈనెల 22వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు



స్టేషన్ మహబూబ్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం క్షేత్రానికి ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీశైలం ప్రత్యేక బస్సుల పాయింట్‌ను శనివారం ఆర్‌ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల రీజియన్‌లో డిపోల నుంచి 130 బస్సులను నడిపినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ డిపో నుంచి 28, నారాయణపేట 18, అచ్చంపేట 15, గద్వాల 15, నాగర్‌కర్నూల్ 15, వనపర్తి 15, కొల్లాపూర్ 10, కల్వకుర్తి 9, షాద్‌నగర్ 5 బస్సులు నడిపినట్లు పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి భక్తుల తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్టాండ్‌లో ప్రత్యేక బస్సు పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమె వెంట డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్ రాంజీ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..

- **నల్లమలలోని భౌరాపూర్‌లో చెంచుల సంప్రదాయ పద్ధతుల్లో భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి కల్యాణం**
- **వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చెంచులు**
- **పెళ్లి పెద్దలుగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు**



శివపార్వతుల కల్యాణానికి తప్పెట్లతో ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న చెంచులు



భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి

సాక్షి, నాగర్‌కర్నూల్/ మన్ననూర్: నల్లమల లోతట్టు ప్రాంతంలోని బైరాపూర్ పెంటలోని భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి కల్యాణాన్ని చెంచులు వైభవంగా నిర్వహించారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం రోజున భౌరమ్మను తమ ఆడబిడ్డగా, మల్లికార్జున స్వామిని అల్లుడిగా భావించి చెంచులు స్వామివారికి కల్యాణం జరిపిస్తారు. జిల్లాలోని లింగాల మండలం బౌరాపూర్‌లోని భ్రమరాంబ, మల్లికార్జున ఆలయంలో శనివారం నిర్వహించిన కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి చెంచులు హాజరయ్యారు. గిరిజన సంక్షేమశాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించింది. కల్యాణోత్సవంలో భాగంగా చెంచులు తమ సంప్రదాయ నృత్యాలతో భౌరమ్మ, మల్లికార్జున స్వామివార్లకు ఎదుర్కోళ్లను చేపట్టారు. దేవతామూర్తుల విగ్రహాలను కొప్పెరలో ఉంచి తప్పట్ల చప్పుళ్లతో ఆలయ సన్నిధికి తీసుకొచ్చారు. చెంచు పూజారి గురువయ్య కల్యాణాన్ని నిర్వహించారు. అమ్మవారి తరపున పెళ్లిపెద్దలుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అమల దంపతులు వ్యవహరించగా, చెంచు కుటుంబానికి చెందిన శంకర్, రామేశ్వరీ దంపతులు స్వామివారి తరపున పెళ్లి పెద్దలుగా వ్యవహరించి కల్యాణాన్ని జరిపించారు. కల్యాణం తర్వాత చెంచులు తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించారు. చెంచుల సమస్యల పరిష్కారం కోసం చెంచు మహాసభను నిర్వహించాలని కోరారు. కృష్ణా నదిలో చేపలు పట్టుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని, గిరిజన భవన్ మంజూరుతో పాటు ఎస్టీ రిజర్వేషన్లలో చెంచులకు భంగం కలుగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గతంలో శ్రీశైలం ఆలయంలో చెంచులే ప్రధాన పూజారులుగా ఉండేవారని, ఇప్పుడు తమకు అవకాశం కల్పించాలని కోరారు. శ్రీశైలంలో చెంచుల కోసం ప్రత్యేకంగా సత్రం నిర్మించాలని డిమాండ్ చేశారు. భైరాపూర్ జాతరకు వచ్చే భక్తుల నుంచి అటవీశాఖ టోల్‌వసూలు చేయడంతో భక్తుల రద్దీ తగ్గుతోందని, ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని విన్నవించారు. ఉమామహేశ్వరం, మద్దిమడుగు క్షేత్రాలకు సంబంధించిన ఆలయ కమిటీల్లో చెంచులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.



పెళ్లి పెద్దలుగా కల్యాణం జరిపిస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు

అధికారుల తీరుపై ఆగ్రహం..

బైరాపూర్ జాతర ఏర్పాట్లతో పాటు గిరిజన సంక్షేమ శాఖ అధికారుల తీరుపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాశ్‌ను నిలదీశారు. ప్రభుత్వం అధికారికంగా చేపట్టిన ఉత్సవాలకు తనను ఆహ్వానించలేదని, అధికారులు మర్యాదపూర్వకంగా నడుచుకోలేదని మండిపడ్డారు. 'వేడుకలకు హాజరైన తనను వేదికమీదకు ఆహ్వానించకుండా అధికారులు నవాబుల్లా కూర్చున్నారు' అని వ్యాఖ్యానించారు.

చెంచుజాతికి అండగా ఉంటా..

చెంచుల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. అచ్చంపేటలో ఆదివాసీ భవన్ కోసం రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఇందుకోసం రెండెకరాల స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. రాజ్యాంగం, సీఎం కేసీఆర్ ఉన్నంత వరకు గిరిజనుల హక్కులకు భంగం కలుగనీయమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి చెంచుల జాతరకు సంబంధించిన నిధులను అధికారుల ఖాతాల్లో కాకుండా ఆలయ కమిటీ ఖాతాల్లో వేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెంచుల సమ్మతి మేరకు పునరావాసం, తరలింపు ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి బలవంతం ఉండదని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యే అయింది తన సంతోషం కోసం కాదని, ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాను కానీ అసహనంతో కాదని చెప్పారు. చెంచులు కోరుతున్న డిమాండ్లలో 90శాతం వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాశ్, డీఆర్‌డీఓ నర్సింగరావు, డీడబ్ల్యూఓ వెంకటలక్ష్మీ, డీపీఆర్వో సీతారాం, ఆర్డీఓ పాండూనాయక్, డీఎస్పీ కృష్ణకిశోర్, చెంచు నాయకులు బాలగురువయ్య, రేవతి, మల్లికార్జున్, మల్లయ్య, నిమ్మల శ్రీను పాల్గొన్నారు.

మారుతున్న సమీకరణం

తారుమారు రాజకీయాలతో వేడెక్కిన పాలమూరు

- **పాత, కొత్త, యువతరం కీలక అడుగులు**
- **అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లోనే పోటాపోటీ**
- పలువురికి బీజేపీ, కాంగ్రెస్ గాలం
- స్వయంగా రంగంలోకి దిగిన జాతీయ, రాష్ట్ర నేతలు
- పలు నియోజకవర్గాల 'హస్తం' నేతల్లో గుబులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: స్వపక్షం లోనే విపక్షంలా వ్యవహరిస్తున్న నేతలు.. మేము ఎవరికి తీసిపోమని, ఎన్నికల బరిలో నిలవడం ఖాయమనే రీతిలో పాలి'ట్రిక్స్' ప్లే చేస్తున్న నేతల వారసులు.. రాజకీయాల్లో సత్తా చాటేందుకు శ్రమిస్తున్న యువతరం.. పునర్ వైభవం దిశగా సీనియర్ లీడర్ల క్రియాశీలక అడుగులు వెరసి పాలమూరు వేడెక్కింది. ఎన్నికల ఏడాది మొదట్లోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ప్రధానంగా బీఆర్‌ఎస్‌లో అభ్యర్థిత్వాలపై పోటాపోటీ నెలకొనగా.. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాయి. స్వయంగా రంగంలోకి దిగిన జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు అధికార పార్టీలోని అసంతృప్తులపై గాలం వేసి రెడీగా ఉన్నారు.

'సీ'నియర్ లీడర్ల క్రియాశీలక అడుగులు..

కొల్లాపూర్‌కు చెందిన సీనియర్ లీడర్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాడు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో ఆయన ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఆ తర్వాత బీరం బీఆర్‌ఎస్‌లో చేరినప్పటి నుంచి ఇద్దరూ అంటీముట్టనట్టుగానే ఉన్నారు. ఇరువురి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా సవాళ్లు, ప్రతి సవాళ్లు నడిచాయి. ఈ క్రమంలో జూపల్లి పార్టీ మారుతారనే ప్రచారం జోరుగా సాగింది. కొన్నాళ్లు ఆయన బీజేపీలో చేరతారనే ప్రచారం జరిగింది. బీజేపీ నాయకుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు గతంలో మంత్రివర్గ సహచరుడు కాగా.. ఆయన ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్‌లో చేరేందుకే జూపల్లి అనుచరులు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయ నాయకులు ఆయనతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే జూపల్లి ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన అనుచరులు భావిస్తున్నారు.

వనపర్తిలో మంత్రికి చిక్కులు..

వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో వర్గపోరుతో చీలికలు ఏర్పడ్డాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమంటూ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి ప్రకటించాడు. మరోవైపు రావుల చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ నుంచే యుద్ధానికి సిద్ధమని ప్రకటించాడు. సొంత కేడర్‌ను కలిగి ఉన్న రావుల బరిలో నిలిస్తే త్రిముఖ పోరు తప్పని పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో లుకలుకలు మంత్రి నిరంజన్‌రెడ్డికి చిక్కులు తెచ్చిపెట్టాయి. మంత్రిని విభేదిస్తున్న జెడ్పీ చైర్మన్‌తో పాటు మరో ముగ్గురు ఎంపీపీలు, పలువురు సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

ఒక్కటా.. రెండా..

ఒకప్పుడు జిల్లా రాజకీయాలను శాసించిన మాజీ ఎమ్మెల్యే దంపతులు క్రియాశీలక అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీని వీడినట్లు ఇదివరకే ప్రకటించిన వారు సరైన ప్లాట్‌ఫాం కోసం వేచిచూస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ ముఖ్య నేతలు వారిని పార్టీలోకి ఆహ్వానించినప్పటికీ.. అనుచరుల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ నాయకులు ఒకరు వారికి స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించినట్లు సమాచారం. అయితే దేవరకద్ర, మక్తల్‌లో ఒక్క నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థిగా హామీ లభించినట్లు తెలిసింది. త్వరలో అన్ని పరిస్థితులు చక్కబడుతాయని భావిస్తున్న వారు చేరికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు వారి అనుచరుల ద్వారా తెలిసింది.

'వారసుల' వార్..

■ **నాగర్‌కర్నూల్ జిల్లాలో అధికార నేతల వారసులు కీలక స్థానాలపై కన్నేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మంచివట్టు ఉన్న ఎంపీ రాములు కుమారుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌కు విద్యావంతుడిగా పేరుంది.** జెడ్పీచైర్మన్ పదవి ఆయనకు గతంలో వచ్చినట్లే వచ్చి చేజారింది. ఇటీవల కోర్టు ఆదేశాలతో జెడ్పీ చైర్మన్ ఎన్నిక అనివార్యం కాగా.. అతడికి మళ్లీ ఆశాభంగమే ఎదురైంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ఆయన తన రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్నారని బాహాటంగానే విమర్శలకు దిగాడు. ఈ క్రమంలో అచ్చంపేటలో బరిలో ఉంటానని తేల్చి చెప్పాడు. ఈ మేరకు రెండు నెలలుగా నియోజకవర్గంలో మండలాల వారీగా పర్యటిస్తున్నాడు.

■ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంపై కన్నేసిన ఓ ఎమ్మెల్సీ కుమారుడు చాపకింద నీరులా అన్ని మండలాల్లో తనకంటూ వర్గాన్ని ఏర్పరచుకున్నాడు. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధితో ఎప్పటినుంచో ఆయనకు విభేదాలు ఉండగా.. పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యనేతలతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. గెలుపే లక్ష్యంగా అందరినీ ఒకేతాటిపైకి తీసుకొచ్చి సత్తా చాటేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

త్రిశంకు స్వర్గంలో అలంపూర్?

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మనవడు చల్లా వెంకట్రామ్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత అలంపూర్ రాజకీయాల్లో క్రమక్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన ప్రతిపాదించిన వారికే ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ ఈ నియోజకవర్గంపై దృష్టిసారించాడు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సొంత నియోజకవర్గం కాగా.. ఇక్కడి నుంచే పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతుండడంతో రాజకీయాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం మారుతున్న రాజకీయ సమీకరణలు అధికార పార్టీతో పాటు కాంగ్రెస్‌లో దుమారం రేపుతున్నాయి. జంప్ జిలానీలతో కొల్లాపూర్, దేవరకద్ర వంటి స్థానాలపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు కలవరపడుతున్నారు.

హరోం.. హర

- **ఘనం**గా మహాశివరాత్రి వేడుకలు
- **కిటకిట**లాడిన నల్లమల శైవక్షేత్రాలు
- **ఉమా**మహేశ్వరంలో ఎంపీ **పోతుగం**టి రాములు పూజలు
- **కృష్ణా**నది బ్యాక్‌వాటర్‌లో **పుణ్యస్నా**నాలు చేసిన భక్తులు
- **సోమేశ్వ**ర ఆలయాన్ని దర్శించుకున్న కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి దంపతులు



సోమేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు



సోమశిల వద్ద కృష్ణమ్మకు పూజలు చేస్తున్న మహిళలు



ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న ఎంపీ పోతుగంటి రాములు

అచ్చంపేట: నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలు శనివారం మహాశివరాత్రి రోజున భక్తులతో కిటకిటలాడాయి. పరమశివుని అనుగ్రహం కోసం భక్తులు ఉపవాస దీక్షలుబూని దీపాలు వెలిగించారు. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం, అమ్రాబాద్ అటవీ ప్రాంతంలోని అంతరగంగా, లింగాల మండలం బౌరాపూర్ శ్రీభ్రమరాంబ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. లొద్దిమల్లయ్య, మన్ననూర్ లింగమయ్య, ఉమామహేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహించారు. శ్రీశైలం వెళ్లే భక్తులు మొదట ఉమామహేశ్వరుడిని దర్శించుకుని అటు నుంచి ప్రకృతి రమణీయమైన మల్లెలతీర్థం చేరుకుని, అటునుంచి శ్రీశైలం మల్లన్న సన్నిధికి వెళ్లి మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్నారు. ఉమామహేశ్వరంలో ఎంపీ పోతుగంటి రాములు పూజలు నిర్వహించారు.

దారులన్నీ నల్లమల వైపే..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దారులన్నీ శ్రీశైలం వైపే వెళ్లాయి. శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున్లు స్వామివార్లను దర్శించుకునేందుకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, శివస్వాములు అధిక సంఖ్యలో తరలిరావడంతో నల్లమల కొండలు పులకరించిపోయాయి.

ఉమామహేశ్వర క్షేత్రంలో..

ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రజలు బారులు తీరారు. గంటల తరబడి నిల్చుని స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తులు పాపనాశని గుండం వద్ద స్నానాలు ఆచరించి ఉమాదేవి, ఉమామహేశ్వరులకు పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. క్షేత్రంలో అర్చకులు వీరయ్యశాస్త్రి వేదమంత్రోచ్చరణల మధ్య భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఉమామహేశ్వర ఆలయం వద్ద భక్తులు

సోమశిలలో...

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిలలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా సోమశిల వద్ద ప్రవహిస్తున్న కృష్ణానది బ్యాక్ వాటర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు చేశారు. అనంతరం అక్కడే కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇంజిన్‌బోట్లు, మరియు టూరిజం లాంచ్‌లో భక్తులు సంగమేశ్వరం సమీపం వరకు ఆనందంగా ప్రయాణం చేశారు. సంగమేశ్వర దేవాలయం వరకు బోట్లు అనుమతి లేనందున నదిలోనే భక్తులు విహరించారు. అనంతరం నది ఒడ్డున గున్న లలితాంభిక, సోమేశ్వరాలయంలోని సోమేశ్వరుడు, మరియు ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకున్నారు. సోమశిల వద్ద సప్తనదులు కలుస్తున్నందున సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆలయానికి చేరుకోగా.. నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బీరం సతీసమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి జాగారం చేసే భక్తులకు నిర్వాహకులు, నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజాప్రతినధులు పాల్గొన్నారు.

విద్యారంగ సంక్షేమమే టీఎస్ యూటీఎఫ్ ప్రధాన ఎజెండా



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య

కందనూలు: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ సంక్షేమమే టీఎస్ యూటీఎఫ్ ప్రధాన ఎజెండా అని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వచ్చే నెల 13న కొనసాగనున్న మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో టీఎస్ యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి పాపన్న గారి మాణిక్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పి.మాణిక్ రెడ్డి 40 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యారంగ సంక్షేమం కోసం పాటుపడుతున్నారని చెప్పారు. విద్యారంగంపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తి మాణిక్ రెడ్డి అని ఆ వ్యక్తి శాసన మండలికి ఎమ్మెల్సీగా ఎన్నికైతే మరిన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఉద్యమం నిర్వహిస్తుందని, విద్యను ప్రైవేటు, కార్పొరేటు పరం చేసేలా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి రాజ్యాంగ విలువలు ప్రతిబింబించే ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమీక్షలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.చిన్నయ్య, కె.శంకర్, జిల్లా కోశాధికారి జె.బాల్‌రాజు, ఎస్.చంద్రశేఖర్, పి.రామేశ్వరయ్య, కె.శంకర్, ఆర్.లక్ష్మణ్, ఎన్.నెహ్రూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భౌరాపూర్ ఉత్సవాల్లో అపశృతి

● చెరువులో మునిగి వృద్ధుడి మృతి


పెద్ద గురువయ్య (ఫైల్)

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతం భౌరాపూర్ పెంట వద్ద ఏట మహా శివ రాత్రి రోజున నిర్వహించే చెంచుల పండగలో అపశృతి చోటు చేసుకుంది. లింగాల మండలం రాంపూర్ పెంటకు చెందిన పెద్ద గురువయ్య(65) శనివారం ఉదయం భౌరాపూర్ చెరువులో యువకులు ఈతలు కొడుతుండగా ఈయన కూడా చెరువులోకి వెళ్లాడు. రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమాల అనంతరం మద్యం సేవించినట్లు సమీప వ్యక్తులు తెలిపారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న గురువయ్య నీటిలోకి వెళ్లగానే మూర్ఛ వచ్చి యువకులు చూస్తుండగానే చెరువులో మునిగిపోయినట్లు తెలిపారు. వెంటనే యువకులు కాపాడే ప్రయత్నంలో కొంత ఆలస్యం కావడంతో అప్పటికే మృతి చెందాడు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నవాబుపేట: కుటుంబ తగాదాలతో పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత శనివారం మృతి చెందింది. మండలంలోని మల్కాపూర్ చెందిన సంపంగి కలమ్మ(39) ఈ నెల 12న భర్త ఆంజనేయులుతో గొడవపడి అందరు నిద్రించిన తర్వాత ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి తాగింది. ఆమె అరుపులతో కుటుంబ సభ్యులు మేల్కొని చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

వ్యభిచార గృహ నిర్వాహకురాలి రిమాండ్

గద్వాల క్రైం: పట్టణంలోని భీంనగర్ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకుని గుట్టుగా వ్యభిచార వ్యవహారాన్ని నడిపిస్తున్న నిర్వాహకురాలితో పాటు యువతిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్ షుకుర్ తెలిపారు. ఏపీకి చెందిన మహిళ కొందరు యువతులను ఇక్కడికి రప్పించి వ్యభిచారం చేయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. అదుపులోకి తీసుకున్న నిర్వాహకురాలిని గద్వాల కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. యువతిని స్వాధర్ హోంకు తరలించాల్సిందిగా జడ్జి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం



మద్దూరు: విద్యుదాగాతంతో గుడిసె దగ్ధమైన సంఘటన కొత్తపల్లి మండలంలోని భూనీడ్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాగం కిష్టప్ప పూరిగుడిసెలో నివాసం ఉంటున్నాడు. రాత్రి విద్యుదాఘాతం కావడంతో నిప్పురవ్వలు గుడిసెపై పడి మంటలు చెలరేగాయి. దీనికి తోడు సిలిండర్ కూడా గుడిసెలో ఉండడంతో హుటాహుటిన నిద్రిస్తున్న వారు బయటకు వచ్చారు. గుడిసెలో కట్టేసిన రెండు మేకలు, కోళ్లు, తిండిగింజలు, కొంత నగదు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ వెంకటేష్ ఆర్థికసాయం అందజేశారు.

50 మేకలు చోరీ

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడకు చెందిన శ్రీనివాసులు రోజూ మేకలు కాస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే శుక్రవారం రాత్రి 50 మేకలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. దీంతో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్రషర్ యజమానిపై కేసు నమోదు

మిడ్జిల్: గుట్టను బ్లాస్టింగ్ చేయటంతో బండ రాయి మీద పడి యువకుడు మృతి చెందిన సంఘటనలో యజమానిపై కేసు నమోదైంది. మండల కేంద్రం సమీపంలో ఖేద్‌గాత్‌తండా సమీపంలోని క్వారీలో పొక్లెయినర్ డ్రైవర్ బాలరాజు శుక్రవారం పనులు చేస్తుండగా బ్లాస్టింగ్ చేపట్టడంతో బండరాళ్లు మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనను బయటికి పొక్కకుండా చేసేందుకు ప్రయత్నించారు. కాగా శనివారం మృతుడి భార్య రాజమని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్రషర్ యజమాని జైపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌లాల్ తెలిపారు.

పెద్దల సమక్షంలో పంచాయితీ?

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన డ్రైవర్ ప్రాణం ఖరీదుగా రూ.8లక్షలుగా నిర్ణయించినట్లు తెలిసింది. ప్రమాదంపై రాజీ కుదుర్చేందుకు పెద్దల సమక్షంలో పంచాయతీ చేశారు. నిర్వాహకులు ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బాలబ్రహ్మేశ్వర నమో నమః


ఆకాశజ్యోతిని తీసుకొస్తున్న భక్తులు

● భక్తులతో కిక్కిరిసిన దక్షిణకాశీ క్షేత్రం
● అభిషేకాలతో అలరాలిన బాలబ్రహ్మేశ్వరుడు
● ఆలయంలో ఘనంగా రుద్రహోమాలు

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరంచుకుని దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. జిల్లాలోని అతి పెద్ద క్షేత్రమైన అలంపూర్ ఆలయాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించి బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో అభిషేక పూజలు, అమ్మవారి ఆలయంలో శ్రీచక్ర పూజలు విశేషంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి బాలబ్రహ్మేశ్వరుడికి భక్తులు నిరంతరంగా అభిషేకాలు చేశారు. గర్భాలయంలో అభిషేకాలు చేయలేని భక్తుల కోసం గరుడబ్రహ్మ ఆలయం వద్ద స్వర్ణలింగాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ భక్తుల చేత స్వర్ణలింగానికి అభిషేకం చేయించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఆవాహిత దేవతా హోమాలతో పాటుగా రుద్రహోమాలు నిర్వహించారు. త్రికాల సమయాలలో ఆలయం చుట్టూ అర్చకులు మంగళవాయిద్యాల మధ్య అష్టదిక్పాలకులకు బలిహరణలు చేశారు. బ్రహ్మోత్సవాలలో త్రికాల సమయాలలో ఆవాహిత దేవతా మండపాల వద్ద ప్రత్యేక పూజలు, మహా నివేదనలు, త్రికాల హారతులు అందజేశారు. రాత్రి 9 గంటల నుంచి యామకాల పూజలు చేశారు. ఆలయంలో అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో శివమాలధారులు ఆలయ శిఖరం నుంచి శివజ్యోతి పేరిట ఆకాశ జ్యోతిని ఎగురవేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు..

ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లలో ఉన్న భక్తుల ఎండతాపం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వెదురు తడికలను కట్టడంతో భక్తులకు వేడిమి నుంచి ఉపశమనం లభించింది. భక్తులకు తాగునీటి వసతితోపాటు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. భక్తుల రద్దీ మధ్యాహ్నం వరకు కొనసాగింది. తిరిగి సాయంత్రం నుంచి జాగరణ కోసం వచ్చే భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి. పట్టణంలోని రోడ్డుకు ఇరుపక్కల ఏర్పాటు చేసిన టెంకాయలు, మిఠాయి, పండ్ల దుకాణాల వద్ద భక్తుల కొనుగోలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో సైతం భక్తులకు అవసరమైన అల్పాహార దుకాణాలు, శీతలపానియాల దుకాణాలు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు

భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ ఆకాంక్షలు విధించారు. మున్సిపాలిటీలోని జూనియర్ సివిల్ కోర్టు వద్ద వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేశారు. కోర్టు పక్కన ఉన్న ఖాళీ స్థలం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఫోర్ వీలర్స్, టూ వీలర్స్ వాహనాల పార్కింగ్ కల్పించారు. అక్కడి నుంచి భక్తులు కాలినడకన ఆలయాలకు చేరుకున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు, దివ్యాంగులకు పార్కింగ్ నుంచి ఆలయానికి ఉచిత ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన భద్రత

పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. డీఎస్పీ రంగస్వామి, సీఐ సూర్యనాయక్, స్థానిక ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో 10 మంది ఎస్ఐలు, 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సృజన భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో కలియ తిరిగారు. పోలీస్ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


పుష్కరఘాట్‌లో భక్తుల పుణ్యస్నానాలు


భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సృజన


జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు


బాలబ్రహ్మేశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

అలంపూర్‌ను దర్శించుకోవడం సంతోషం


హోమ పూజలలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు, నాయకులు

● ఎమ్మెల్సీ కవిత
● జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దర్శించుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. శనివారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమలతో కలిసి దర్శించుకున్నారు. బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి వారిని శాలువాతో సత్కరించి అమ్మ, స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో తుమ్మిళ్ల, అలంపూర్ ఎత్తిపోతలతోపాటు మరో రెండు ఎత్తిపోతలను బాగు చేసుకున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న భూములకు ఎంత మేర నీళ్లు అందించడానికి అవకాశం ఉందో అంత బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో తుంగభద్ర, కృష్ణా నదులు ఉన్నప్పటికీ నీళ్లు లేని పరిస్థితులను చూశామన్నారు. ఆ పరిస్థితులను దాటుకుని కుగ్రామాల వరకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతుందని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో ఆర్డీఎస్‌పై పాదయాత్ర చేసి ఈ ప్రాంతాన్ని కదిలించారన్నారు. ఆర్డీఎస్‌ను సైతం దాదాపు రూ.13 కోట్లతో పునరుద్ధరించినట్లు చెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టును పూర్తిస్థాయిలో స్థిరికరించడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయాలను గమనించుకోవాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నా వంతుగా కృషి చేస్తానన్నారు.

■ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి హయాంలో తుంగభద్ర నదిపై బ్రిడ్జి మంజూరు కాగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో కర్ణాటక భక్తులకు సుమారు 60 నుంచి 70 కి.మీ. దూరం తగ్గుతుందన్నారు. కొన్ని నిబంధనలు క్షేత్ర అభివృద్ధిలో ప్రతిబంధకంగా ఉన్నాయని, ఇవి ఇక్కడే కాదు రామప్ప క్షేత్రంలో ఉన్నాయమన్నారు. ఆలయాల పరిరక్షణకు నిబంధనలు ఉండటం మంచిదే అన్నారు. ఈ నిబంధనలను గౌరవిస్తూనే అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పుల్లూరులో అల్పాహారం

ఎమ్మెల్సీ కవిత ఉండవెల్లి మండలం పుల్లూరును సందర్శించారు. అలంపూర్ క్షేత్ర దర్శనం అనంతరం మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి ఆహ్వానం మేరకు ఆయన స్వగృహంలో అల్పాహార విందుకు హాజరయ్యారు. గ్రామ ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని సూర్యనారయణ స్వామి, శివాలయాల్లో పూజలు చేశారు.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం ఆపండి


చిన్నచింతకుంటలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కెమికల్ పరిశ్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాటాల సమితి కన్వీనర్ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 8వ రోజు శనివారం మండలంలోని సీతరాంపేట, నెల్లికొండి, చిన్నవడ్డేమాన్, ఏదులాపూర్, మద్దూర్‌లో కొనసాగింది. ఫ్యాక్టరీ వల్ల మరికల్, నర్వ, చిన్నచింతకుంట మండలాల రైతులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. వాతావరణం, నీరు కలుషితమై రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. గోవింద్, నర్సప్ప, ఖలీల్, యాదగిరి పాల్గొన్నారు.

మన్యంకొండకు పోటెత్తిన భక్తులు

● శేషవాహనంపై ఊరేగిన స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మహాశివ రాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉపవాస దీక్షలతో చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొన్నారు. దేవస్థానం పక్కనున్న శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. భక్తులు స్వామివారికి దాసంగాలు పెట్టి మొక్కులు సమర్పించగా, మరికొంత మంది తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ మహబూబ్‌నగర్ నుంచి మన్యంకొండకు ప్రత్యేక బస్సులు నడిపించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయంలో అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. శివాలయంలోని శివలింగాన్ని రకరకాల పూలతో సుందరంగా అలంకరించారు.

వైభవంగా శేషవాహన సేవ

దేవాలయంలో శనివారం రాత్రి స్వామివారి శేషవాహన సేవ నిర్వహించారు. వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామస్మరణల మధ్య స్వామివారి ఊరేగింపు భక్తకోటికి దర్శనమిచ్చారు. అనంతరం మళ్లీ స్వామివారిని శేషవాహనంపై గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మన్యంకొండ శివాలయంలో అలంకరణలో శివలింగం


దర్శనానికి బారులు తీరిన భక్తులు


కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు స్వాహా

జడ్చర్ల: గుర్తు తెలియని వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ ఉన్న డబ్బులను డ్రా చేసుకుని మోసం చేశాడని బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లెనిన్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చర్లపల్లికి చెందిన వృద్ధురాలు దాసరి సరోజ వద్దకు ఈనెల 2న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పింఛన్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ య్యేలా చేస్తానని నమ్మ బలికాడు. దీంతో ఆమె ఆధార్ నంబర్ ఇవ్వడంతో పాటు చేతి బొటన వేలును ఉపయోగించి ఫింగర్ ప్రింట్ తీసుకుని వెళ్లిపోయాడు. ఈనెల 13న డబ్బు అవసరం వచ్చి బ్యాంకు వద్దకు వెళ్లగా ఖాతాలో నిల్వ ఉన్న రూ.10వేలు ఈనెల 2న డ్రా చేసినట్లు సిబ్బంది తెలిపారు. దీంతో తన వేలిముద్ర, ఆధార్‌నంబర్ సాయంతో డబ్బును గుర్తు తెలియని వ్యక్తి డ్రా చేసుకుని మోసం చేసినట్లు గ్రహించింది. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గండేడ్: అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని పగిడ్యాల్ చెందిన తారకమ్మ ఇంట్లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసింది. ఈ సమాచారం పెట్రోలింగ్ పోలీసులకు అందడంతో వారు తనిఖీ చేశారు. మూడు క్వింటాళ్ల బియ్యం ఉండడంతో వాటిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీకి సమాచారం అందించినట్లు ఎస్ఐ సైదయ్య తెలిపారు.

ట్రాన్స్‌కో అధికారులపై ఫిర్యాదు

జడ్చర్ల: స్థానిక నిమ్మబాయిగడ్డ వద్ద ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తన భర్త చావుకు కారణమైందని శనివారం పోలీసులకు భార్య ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లెనిన్ తెలిపిన వివరాల మేరకు .. నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో శుక్రవారం రోడ్డు దాటుతూ ప్రమాదవశాత్తు తీగకు తన భర్త శ్రీశైలం (38) తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడని భార్య రాధా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అరుదైన వ్యాధితో విద్యార్థిని మృతి

● గురుకుల సిబ్బంది నిర్లక్ష్యమని పలువురి ఆగ్రహం

మహమ్మదాబాద్: అరుదైన వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన సంఘటన నంచర్ల గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం గుడిగంపల్లికి చెందిన బీమనోళ్ల లావణ్య (12) మండలంలోని నంచర్ల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. ఇదే క్రమంలో ఈ నెల 8వ తేదీన విద్యార్థినికి దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో జ్వరం వచ్చింది. విషయం గమనించిన స్టాఫ్‌నర్సు బాలికకు మాత్రలు ఇచ్చింది. 3 రోజుల వరకు విద్యార్థిని ఆరోగ్యం బాగానే ఉందనుకున్నారు. అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి అన్ని రకాల పరీక్షలు చేశారు. ఐదు రోజులపాటు ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 16న రాత్రి 8:30 గంటలకు మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం బాలిక మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి 17న రాత్రి అంత్యక్రియలు చేసినట్లు గురుకుల వైస్ ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. కాగా విద్యార్థినికి ప్రతి వెయ్యి మందిలో ఒకరికి ఉండే గులియన్ బ్యారీ సింద్రో వ్యాధి సోకినట్లు వైద్యులు చెప్పినట్లు స్టాఫ్‌నర్సు తెలిపారు. విద్యార్థి కుటుంబంలో ఇలాంటి వ్యాధి ఉన్నదని అలాంటి లక్షణాలు విద్యార్థినికి ఎప్పుడూ బయటపడలేదని తెలిపారు. కాగా విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. అందరితో కలిసి స్నేహంగా ఉంటూ తోటి స్నేహితురాలు మృతిచెందిన వార్త వినగానే గురుకుల పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఫ్లాష్.. ఫ్లాష్..

అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

- అలంపూర్‌లో బైక్‌కు ఢీ కొట్టిన వ్యాన్
- ముగ్గురు యువకుల దుర్మరణం



వ్యాన్‌పై పడిన మృతదేహం

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బైరాపురం గ్రామశివారులో శనివారం అర్ధరాత్రి 12.40 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. మానవపాడు మండలం కొర్విపాడుకి చెందిన సాయి, రఫీ, శేఖర్ అనే యువకులు అలంపూర్‌లో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చారు. ఆకాశజ్యోతి దర్శనం అనంతరం అలంపూర్ నుంచి వారి స్వగ్రామమైన కొర్విపాడు గ్రామానికి ఒకే బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బైరాపురం గ్రామ శివారులో డీ-బుర్దిపాడు వైపు నుంచి కోళ్ల లోడుతో వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయి, రఫీ అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. తీవ్రంగా గాయపడిన శేఖర్‌ను ఆస్పత్రికి తరలించే క్రమంలో అక్కడే మృతి చెందాడు. అలంపూర్ సీఐ సూర్యానాయక్, ఎస్సై మహేందర్, ఉండవల్లి ఎస్‌ఐ బాలరాజు, ఏఎస్‌ఐ అయ్యన్న సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



మాజీ ఎమ్మెల్యే సర్రాజు కన్నుమూత

సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి, అమరావతి: మాజీ ఎమ్మెల్యే, ఏపీ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు (72) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందా రు. శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురైన సర్రాజు ను భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్రాజు మరణం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హుటాహుటిన భీమవరంలోని ఆదర్శనగర్‌కు చేరుకుని సర్రాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తారకరత్న కన్నుమూత



లోకేశ్ పాదయాత్రలో అస్వస్థతకు గురై కుప్పకూలిపోతున్న తారకరత్న (ఫైల్)

▶ మొదటి పేజీ తరువాయి

రక్తం గడ్డకట్టడంతో మెదడులో ఒకవైపు వాపు వచ్చినట్టు తెలిసింది. అప్పటి నుంచి బ్రెయిన్‌కు సంబంధించిన అన్ని రకాల చికిత్సలు చేస్తూ వచ్చారు. తొలుత బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రి నుంచి ప్రత్యేకంగా వైద్యులను పిలిపించి చికిత్స అందించగా, వారం నుంచి విదేశాల నుంచి ప్రత్యేకంగా న్యూరోసర్జన్లు, న్యూరాలజిస్టులను కూడా రప్పించి చికిత్స అందించారు. అయినప్పటికీ తారకరత్న ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మధ్యలో పరిస్థితి కొంచెం మెరుగైందని, చికిత్సకు స్పందిస్తూ కోలుకుంటున్నారనే వార్తలు వచ్చినా, రెండు రోజులుగా పరిస్థితి మరీ క్షీణించడంతో విషమంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణతో పాటు నందమూరి కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్నారు. పూర్తి సమాచారాన్ని వైద్యులు వారికి వివరించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు వెంటిలేటర్ తొలగించారు.

పాదయాత్ర ప్రారంభం రోజునే..

నందమూరి తారకరత్న గత నెల 27న కుప్పంలో లోకేశ్ పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంట ఉన్న నాయకులు ఆయన్ను అక్కడి నుంచి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయనకు పల్స్ అందడం లేదని వైద్యులు తెలిపారు. అక్కడే క్రిటికల్ కేర్ వైద్యం చేశారు. అయితే తారకరత్న గుండెపోటుతో అప్పుడే ప్రాణాలొదిలినా.. లోకేశ్ పాదయాత్రను దృష్టిలో ఉంచుకుని బెంగళూరు ఆస్పత్రికి తరలించారనే ప్రచారం జరిగింది. లోకేశ్‌కు చెడ్డ పేరు రాకూడదనే ఇన్నాళ్లూ మెరుగైన వైద్యం పేరుతో కథ నడిపించారని టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎట్టకేలకు పర్వదినమైన శివరాత్రి రోజున తారకరత్న శివైక్యం చెందినట్లు ప్రకటించడం గమనార్హం.

అభిమానుల ఆందోళన

తారకరత్న మరణవార్త విన్న నందమూరి అభిమానులు నారాయణ హృదయాలయకు వందలాదిగా చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి వెనుక గేటు నుంచి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. తమకు చివరి చూపు కూడా దక్కకుండా అలా తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ కాసేపు ఆందోళన చేపట్టారు.

ప్రముఖుల సంతాపం

సినీ నటుడు, ఎన్టీఆర్ మనవడు నందమూరి తారకరత్న మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తారకరత్న మరణ వార్త తనకు తీవ్ర దిగ్భ్రాంతి, బాధను కలిగించిందని టీడీపీ అధినేత చంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తారకరత్నను బతికించుకునేందుకు చేసిన ప్రయత్నాలు, కుటుంబ సభ్యులు, అభిమానుల ప్రార్థనలు, అత్యంత నిపుణులైన డాక్టర్ల వైద్యం ఫలితాన్ని ఇవ్వలేదన్నారు. తారకరత్న ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు చంద్రబాబు పేర్కొన్నారు. తారకరత్న మరణంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఒకేసారి 9 సినిమాలతో రికార్డు

ఎన్టీఆర్ ఐదో కుమారుడైన నందమూరి మోహనకృష్ణ, శాంతిమోహన దంపతులకు 1983 ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లో జన్మించారు తారకరత్న. ఛాయాగ్రాహకుడిగా మోహనకృష్ణకు మంచి పేరుంది. చెన్నైలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తరువాత హైదరాబాద్‌కు మకాం మార్చిన తారకరత్న జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్‌లో ఉన్నత పాఠశాల చదువు పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని విజ్ఞాన్ భవన్‌లో బీటెక్ చదువుకున్నారు. మొత్తం 23 సినిమాలు, ఒక వెబ్ సిరీస్‌లో తారకరత్న నటించారు. ఆయన చిత్రరంగ ప్రవేశమే ఒక రికార్డు. 20 ఏళ్ల వయసులో ఒక హీరోగా తారకరత్న ఒకేసారి 9 సినిమాలు ప్రారంభించడం అప్పట్లో రికార్డు. 2001లో ఒకటో నంబర్ కుర్రాడు సినిమా ద్వారా తెరంగేట్రం చేశారు. అమరావతి సినిమాతో ఆయనను నంది అవార్డు వరించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో కథానాయకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా నటించారు. 'మహాభక్త సిరియాల'లో శివ భక్తుడిగా నటించిన తారకరత్న మహాశివరాత్రి నాడు శివైక్యం పొందారు. 2012లో అలేఖ్యరెడ్డిని ప్రేమించి వివాహం చేసుకున్నారు. నందీశ్వరుడు సినిమాకు అలేఖ్యరెడ్డి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేశారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

'ధరణి' ఇలా దారిలోకి!

▶ మొదటి పేజీ తరువాయి

నివేదికలోని అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా చాలా వరకు 'ధరణి'సమస్యలను పరిష్కరించవచ్చని చెబుతోంది.

సమస్యలపై ట్రిసా నివేదికలోని అంశాలివే...

- వారసత్వ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న వారం తర్వాత కూడా తహసీల్దార్/ఆపరేటర్ లాగిన్‌లకు సమాచారం రావడంలేదు. సదరు దరఖాస్తులు చేసుకున్న సమయంలోనే తహసీల్దార్/ఆపరేటర్ లాగిన్‌లలో నోటీసు వచ్చేలా ఆప్షన్ ఇవ్వాలి.
- ఒక సర్వే నంబర్‌లోని కొంతభాగం భూమిని గతంలో ఉన్న తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసి ఉంటే, ఆ భూమిని ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే ఆ సర్వే నంబర్‌లోని అన్ని భూములకూ ప్రస్తుత తహసీల్దార్ డిజిటల్ సంతకం కనిపిస్తోంది. అలాకాకుండా ఏ తహసీల్దార్ డిజిటల్ సంతకం చేస్తే వారి సంతకమే కనిపించేలా సరిచేయాలి.
- తహసీల్దార్ లాగిన్‌లలో ప్రస్తుత పహాణీ/భూహక్కుల అంతర్గత పుస్తకం/ పాసు పుస్తకాలు కనిపించడంలేదు. దీంతో రికార్డుల పరిశీలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా భూసేకరణ ద్వారా ప్రభుత్వం తీసుకున్న భూములను పరిశీలించే క్రమంలో సమస్యలు వస్తున్నాయి. తహసీల్దార్ లాగిన్‌లో ప్రస్తుత పహాణీలు, ఆర్‌వోఆర్‌బీలు, పాసుపుస్తకాలు అందుబాటులో ఉంచాలి.
- ఉన్న భూమి కంటే ఎక్కువ, తక్కువగా రికార్డయిన వివరాలను సరిచేసే ఆప్షన్ ఇవ్వాలి.
- రిజిస్ట్రేషన్ జరిగిన డాక్యుమెంట్లకు సర్టిఫైడ్ కాపీలు తీసుకునే అవకాశం ప్రస్తుతం ధరణిలో లేదు. కానీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం సర్టిఫైడ్ కాపీలిస్తున్నారు. వీటి కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నందున మీసేవ ద్వారా వాటిని తీసుకునే అవకాశం కల్పించాలి.
- ధరణి ప్రాజెక్టు అందుబాటులోకి రాకముందు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లను రద్దు చేసుకునేందుకు, వాటిల్లోని తప్పులను సరిచేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వాలి.
- కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి రాకముందు తహసీల్దార్లు, ఆర్డీవోలు జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీలను అమలు చేసే ప్రొవిజన్ ఇవ్వాలి.
- వివాదాల్లో ఉన్న ఇనాం భూములను ప్రాసెస్ చేసేందుకు, ఓఆర్‌సీలు జారీ చేసేందుకు ధరణిలో అవకాశం కల్పించాలి.
- రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత మ్యుటేషన్ జరిగేలోపు పట్టాదారుడు చనిపోతే ఆ పట్టాదారువారసులకు మ్యుటేషన్ చేసే అవకాశం ఇవ్వాలి.
- అసలైన పట్టాదారులను ఇబ్బంది పెట్టాలన్న ఆలోచనతో కొందరు మీసేవ కేంద్రాల ద్వారా పట్టాభూములను నాలా కోసం దరఖాస్తు చేస్తున్నారు. దీంతో అసలైన పట్టాదారులకు ఇబ్బంది అవుతోంది. అలాంటి థర్డ్ పార్టీ దరఖాస్తులను రద్దు చేసే ఆప్షన్ ఇవ్వాలి.
- సిటిజన్ పోర్టల్ ద్వారా భూముల నిర్వహణ, సేల్ సర్టిఫికెట్, ఎక్స్ఛేంజ్ డీడ్‌లు చేసుకునే అవకాశం పవర్ ఆఫ్ అటార్నీలకు ఇవ్వాలి.
- ధరణిలో తప్పుగా నమోదై, డిజిటల్ సంతకాలు కాని ఎంట్రీలను తొలగించే ఆప్షన్ ఇవ్వాలి. రిజిస్టర్డ్ డాక్యుమెంట్లలో పొరపాటున పడిన చిన్న, చిన్న తప్పులను సవరించుకునే అవకాశం కూడా ఇవ్వాలి.
- కొన్ని అసైన్డ్ భూముల రికార్డుల్లో భూమి స్వభావాన్ని పొరపాటున పట్టా అని నమోదు చేశారు. ఈ కారణంతో ఈ భూములన్నీ నిషేధిత జాబితాలో కనిపిస్తున్నాయి. ఈ రికార్డులను సరిచేసే ఆప్షన్ టీఎం-33లో కనిపించడం లేదు. దీంతో అసైన్డ్ భూములకు వారసత్వహక్కులు కూడా కల్పించలేకపోతున్నాం.
- రెండు ఖాతాలు కలిగిన రైతులు ఒక ఖాతాలో ఆధార్ నమోదు చేసుకోకపోతే మళ్లీ నమోదు చేసుకునేందుకు ధరణి పోర్టల్ అనుమతించడం లేదు. మీరు నమోదు చేసిన ఆధార్ నంబర్ ఇప్పటికే ఉందని చూపిస్తోంది. ఈ సమస్యను సవరించాలి.
- ఆర్డీవో స్థాయిలో ఇప్పటికే ప్రొసీడింగ్స్ వచ్చిన భూములకు వ్యవసాయ కేటగిరీ నుంచి నాలా కేటగిరీకి మార్చుకునే అవకాశం కల్పించాలి.
- వీలునామాలను అమలు పరిచే ఆప్షన్ ఇవ్వాలి.

ఏపీ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా జోగినాయుడు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా సినీనటుడు ఎల్.జోగినాయుడుని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డివిజన్‌లోని చెర్లోపాలెం గ్రామానికి చెందిన జోగినాయుడు చలనచిత్ర నటుడిగా 150కి పైగా చిత్రాలలో నటించారు. చిత్ర, టెలివిజన్ రంగాలలోని పలు విభాగాలలో దాదాపు 25 ఏళ్ల అనుభవం ఉంది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. జోగినాయుడు నియామకానికి సంబంధించి ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ విజయవాడ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

మోదీకి దేశ ప్రయోజనాల కంటే అదానీయే ముఖ్యం

మంత్రి కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో ఇచ్చిన హామీని ప్రధాని నరేంద్ర మోదీ పట్టించుకోకపోవడం వెనుక అసలు కారణం ఏమిటో ఇప్పుడు తెలిసిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. ప్రధాని మోదీకి దేశ ప్రయోజనాలకంటే స్నేహితుడి ప్రయోజనాలే ఎక్కువ కావడం సిగ్గుచేటని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బయ్యారం స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మాట తప్పిందని బీఆర్‌ఎస్ నేత, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియోను కేటీఆర్ రీ ట్వీట్ చేశారు. క్రిశాంక్ మంచి పరిశోధన, గొప్ప విశదీకరణ చేశారని కేటీఆర్ మెచ్చుకున్నారు. 'విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బైలడిల్లా గనుల నుంచి బయ్యారానికి ముడి ఇనుము సరఫరా చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. కానీ ప్రధాని మోదీ మాత్రం తెలంగాణ వినతిని పట్టించుకోకుండా బైలడిల్లా నుంచి కొరియన్ కంపెనీ పోస్కోకు ముడిఇనుమును సరఫరా చేయాలని 2018 ఏప్రిల్ 25న నిర్ణయించారు. ఈ క్రమంలో 2018 సెప్టెంబర్ 20న గుజరాత్ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ బైలడిల్లాను టేకోవర్ చేశారు. పోస్కో కంపెనీ, అదానీ కంపెనీ కలసి రూ.37,500 కోట్ల స్టీల్ ప్లాంట్ డీల్‌పై సంతకాలు చేశాయి'అని క్రిశాంక్ తన వీడియోలో పేర్కొన్నారు.

యజమానికి తెలియకుండానే ప్లాట్ రిజిస్ట్రేషన్

ఉండవెల్లి: ఒక ప్లాటును యజమాని ప్రమేయం లేకుండా నలుగురు వ్యక్తుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. శనివారం ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్లూరు శివారులోని అలంపూర్‌చౌరస్తాలో 15 సెంట్లు ఉన్న ప్లాటును 1986లో ఘంటసాల రాధాకృష్ణ కొనుగోలు చేశాడు. 2022లో ఈసీ తీయడంతో ఆ ప్లాటు నలుగురి చేతులు మారినట్లు చూపించింది. గతేడాది ఆగస్టులో మండల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తులో కర్నూల్‌కు చెందిన రమణేశ్వర్‌రెడ్డి, దూపం రామకృష్ణ కలిసి అలంపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గతంలో ఉన్న ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ హఫీజ్‌తో చేతులు కలిపి నకిలీ ఆధార్‌కార్డును సృష్టించి అసలైన ధ్రువపత్రాలు లేకుండానే 2018లో దూపం రామకృష్ణపై రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నకిలీ రికార్డులు సృష్టించిన రామకృష్ణ, రమణేశ్వర్‌రెడ్డిని జనవరిలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ హఫీజ్, సిబ్బంది మాలిక్ బాషా, యాకుబ్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత



వనపర్తి క్రైం: ఇటీవల మృతిచెందిన కానిస్టేబుల్ శ్రీనివాసులు భార్య కవితకు రూ.20లక్షల భద్రత చెక్కును శనివారం ఎస్పీ రక్షితమూర్తి అందజేశారు. బాధిత కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నిరకాల లబ్ధి సాధ్యమైనంత త్వరగా వచ్చేలా కృషి చేస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

ఘనంగా లక్ష్మీచెన్నకేశవుడి గంపజాతర



గంపలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

- పంటలతో పడమర నుంచి పాదయాత్ర
- గంగాపురంలో మార్మోగిన చెన్నకేశవ, గోవిందనామస్మరణ

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం గంప జాతర ఘనంగా నిర్వహించారు. జాతరకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం చెన్నకేశవుడి, గోవింద నామస్మరణతో మార్మోగింది. ఏటా మాఘ మాసం తొలివారంలో స్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహించి, ప్రతి రెండేళ్లకు ఓ సారి ఇదేమాసం చివరి శనివారం గంప జాతర నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. పడమర ప్రాంతమైన నారాయణపేట, కోయిల్‌కొండ, కోస్గి, కొడంగల్, మద్దూర్ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ పొలంలో పండిన కొత్త పంటల ధాన్యం, బెల్లం ఇతర దినుసులను అలంకరించిన కొత్త గంపలో సిద్ధం చేసుకుని, నెత్తిన పెట్టుకుని పాదయాత్రగా లక్ష్మీచెన్నకేశవుడి చెంతకు బయలుదేరారు. గంప జాతర పురస్కరించుకుని స్వగ్రామాల్లో వారు శుక్రవారమే బయలుదేరారు. గంపను దించకుండా ఒకరి తర్వాత మరొకరు కుటుంబ సభ్యులు తలపై మోస్తూ శనివారం ఆలయానికి చేరుకున్నారు. మధ్యలో బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న చెన్నకేశవస్వామిని దర్శనం చేసుకుని అక్కడ టెంకాయలు సమర్పించి గంగాపురం ఆలయానికి వెళ్లారు. బాదేపల్లి నుంచి గంగాపురం శివారులో వీరభద్రుడి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపుగా గంగాపురం చేరుకుని ఆలయం ఎదురుగా ఉన్న రథం చుట్టూ గంపలతో ప్రదక్షిణలు చేశారు. గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత వంటావార్పు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. కొందరు తలనీలాలు సమర్పించగా మరికొందరు గోవులను ఆలయంలో అప్పగించారు.



ఊరేగింపులో నృత్యాలు..



గంపలతో చెన్నకేశవ ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

'పొల్యూషన్' బోర్డు అవినీతితోనే కాలుష్యం



ధర్నా చేస్తున్న గ్రామస్తులతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుద్‌రెడ్డి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుద్‌రెడ్డి

బాలానగర్: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అవినీతితోనే పరిశ్రమల నుంచి కాలుష్యం తీవ్రమవుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుద్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని గుండేడ్ గ్రామానికి ప్రక్కనే ఉన్న మహావీర్ పరిశ్రమ నుంచి తీవ్ర వాయు కాలుష్యం వెదజల్లుతుందని గ్రామస్తులు మూడు వారాలుగా పరిశ్రమ గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్నారు. శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. పరిశ్రమను తరలించే వరకు పోరాటం చేస్తున్న గ్రామస్తులకు పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. తాము రంగారెడ్డిగూడ పరిధిలోని బిలాస్‌రాయ్ స్పాంజ్ ఐరన్ పరిశ్రమను తరలించేందుకు కొన్నేళ్లు పోరాడి మూయించామన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరపున పరిశ్రమ వ్యక్తులకు మద్దతుగా ఎలాంటి పొల్యూషన్ లేదని బోర్డు అధికారులు తిరిగి పరిశ్రమను తెరిపించారని గుర్తు చేశారు. చిత్తశుద్ధి ఉంటే పరిశ్రమ తరలించేందుకు స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సైతం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కో ఐరన్ పరిశ్రమకు కనీస దూరం 5కిలోమీటర్లు ఉండాలని, అలాంటిది ఇక్కడ ఒక్కో పరిశ్రమకు మరోటి ఆనుకుని, మరికొన్ని మూడు కిలో మీటర్లు ఉన్నాయని అన్నారు. గ్రామానికి అత్యంత సమీపంలో ఉన్న పరిశ్రమ వెదజల్లే కాలుష్యం ప్రస్తుతం ప్రజలకు అనేక వ్యాధులను తెచ్చిపెడుతుందని అన్నారు. ఇలాంటి పరిశ్రమలను దూరంగా తరలించాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరమణారెడ్డి, శంకర్‌నాయక్, చెన్నారెడ్డి, వెంకట్ నాయక్, గణేష్ గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

వైభవంగా దత్తాత్రేయ స్వామి రథోత్సవం



పస్పులలో రథం లాగుతున్న భక్తులు

మక్తల్: మండలంలోని పస్పుల గ్రామంలో కృష్ణానది ఒడ్డున వెలసిన వల్లబాపురం దత్తాత్రేయ స్వామి రథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి పల్లకీపై స్వామిని తీసుకువచ్చి రథోత్సవంపై కూర్చోబెట్టి పూజలు చేశారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ వనజదత్తు పూజలు చేసి రథాన్ని లాగారు. రథోత్సవం సందర్భంగా రథాన్ని పూలతో అలంకరించారు.

- కట్ట తెగి ఏడు నెలలు పూర్తి
- తాత్కాలిక మరమ్మతు చేసినా ఫలితం శూన్యం
- ప్రశ్నార్థకంగా మారిన వానాకాలం సాగు

పెద్ద చెరువు కింద సాగు లేనట్టేనా?



గతేడాది పెద్ద చెరువు కట్ట తెగి పోతున్న నీరు (ఫైల్)

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్లను కలిపి ఉన్న పెద్ద చెరువు ఈ గ్రామాలకు దిక్కు. సాగుకు చెరువు నిండితే దాదాపుగా 300 ఎకరాలకు పైగా ఆయకట్టు వరిపంట సాగులోకి వస్తుంది. కానీ గతేడాది ఆగస్టు 8న చెరువు నిండగా, ఆ సంతోషం కొద్ది సేపటిలోనే చెరువుకట్ట తెగింది. దీంతో చెరువు కింద అప్పటికే సాగు చేసిన వరి పంటలు దాదాపుగా 265 ఎకరాల నీటితో నిండిపోయాయి. 49 ఎకరాల మొక్కజొన్న, 50 ఎకరాలకు పైగా కూరగాయల పంటలు నీటమునిగాయి.

రెండో సారి తెగిన కట్ట..

చెరువు కట్ట తెగిన తర్వాత వర్షాలు కురుస్తుండటంతో రైతుల కోరిక మేరకు రూ.5 లక్షలతో ఆగస్టు 28న కట్ట తెగిన చోట రింగ్ బండ్ ఏర్పాటు చేశారు. వారం రోజులకే తెగిపోవటంతో అప్పటికే చెరువులో చేరిన నీళ్లు కాస్తాపోయాయి. దీంతో చెరువు మొత్తం ఎడారిని తలపిస్తుంది.

వర్షాకాలం సాగు ప్రశ్నే..

వర్షాకాలం మరో నాలుగు నెలలే ఉండటంతో అప్పటిలోగా కట్ట నిర్మాణం ప్రశ్నగానే మిగిలింది. కట్ట నిర్మాణం ఇప్పట్లో చేపడితే 90 రోజుల్లో నిర్మాణం పూర్తి కావటం కష్టం. అలాంటిది పనులు ప్రారంభం కాకపోగా కట్టకు సంబంధించిన నిధులు విడుదల కాలేదు. చాలా మంది చెరువుపై ఆధారపడి జీవిస్తుండటంతో వారికి చెరువు కట్ట నిర్మాణం కాకపోవటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెరువుకట్ట ప్రస్తుత పరిస్థితి

నిధులు మంజూరు

చెరువు కట్ట నిర్మాణానికి మొదటి విడతలో రూ.40 లక్షలు మంజూరయ్యాయి. కట్ట పటిష్టంగా నిర్మించేందుకు మరో రూ.60 లక్షల వెచ్చించాలని ఎంపీ, ఎమ్మెల్యేను కోరాం. కాగా కట్ట పనులు త్వరగా చేపట్టేలా అధికారులతో మాట్లాడుతాం.

– నర్సింహులు, సింగిల్‌విండో చైర్మన్, నవాబుపేట

కట్ట నిర్మించాలి

కట్ట తెగినప్పుడు నష్ట పోయిన రైతులకు పరిహారం అందించాలి. అలాగే రూ.22లక్షల చేపలు కొట్టుకుపోయి మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వారికి పరిహారం అందించాలి. వెంటనే కట్టకు నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలి. కేవలం కట్ట తెగిన చోట కాకుండా కట్ట మొత్తం పటిష్టంగా ఉండేలా సర్వే చేసి నిర్మించాలి.

– ఆనంద్, నవాబుపేట

చెప్పినా పట్టించుకోలేదు..

చెరువు కట్ట తెగుతుందని చెప్పినా అప్పట్లో అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. కట్ట రెండు సార్లు తెగింది. రింగ్ బండ్ వేసేటప్పుడు కూడా చెప్పాం. తూతూ మంత్రంగా వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో రెండోసారి తెగింది. ఇప్పుడు కట్టను నాణ్యతతో నిర్మించాలి. వచ్చే వర్షాకాలం పంటలు సాగులోకి వచ్చేలా చూడాలి.

–బుద్దయ్య, రుక్కంపల్లి